# మంత్రి కుర్సి

సింగిల్ పేజి కథ

ఎన్కట విక్రమార్కుడు నడ్సుకుంట బొందల గడ్డతాన్కి బోయెటోడు. చెట్టు మీద ఉన్న పీన్గెను దించి బుజం మీద ఏస్కునేటోడు. గా పీన్గల ఉన్న బేతాలుడు గానికి కత జెప్పెటోడు. నడ్పి విక్రమార్కుని జమానల గాడు సైకిల్ మీద బొందల గడ్డతాన్కి బోయెటోడు. బేతాలున్ని సైకిలెన్క గూసుండబెట్టుకునేటోడు. విక్రమార్కుడు సైకిల్ దొక్కుతుండంగ సైకిలెన్క గూసున్న బేతాలుడు కత జెప్పెటోడు. గిప్పుడు చిన్న విక్రమార్కుడు మోటర్ల బొందలగడ్డ తాన్కి బోతున్నడు. బేతాలుడు మోటర్ల ఎన్క సీట్ల గూసోని కత జెప్తున్నడు. ఎప్పటి లెక్కనే గా దినం చిన్న విక్రమార్కుడు మోటర్ల బొందల గడ్డకాడ్కి బోయిండు. బేతాలుడు మోటర్ ఎన్క సీట్ల గూసోని-

" మోటర్ నడ్పుతుంటె నీకు బోర్‌గొట్టొచ్చు. బోర్‌గొట్టకుంట ఉండెతందుకు ఒకకత జెప్త ఇను.

గదొక పల్లెటూరు. గా పల్లెటూర్ల ఒగాయిన ఉన్నడు. పొట్టతిప్పల కోసం గాయిన ఒక బొగ్గుల పొయ్యి దీస్కోని పక్క ఊరికి బోయిండు. పక్క ఊరికి బోయెటప్పుడు గాయిన నూరు రూపాలను గొంచబోయిండు. గని దగ్గర నూరు రూపాలున్నయని గాయిన ఎవ్వలికి జెప్పలేదు. మీది కెల్లి ఊరి పెద్దమనుసుల కాడ్కి బోయి-

" నేను శాన బీదోన్ని . మీ ఊర్లె చాయ్ అమ్ముకోని బత్కెతందుకు ఒచ్చిన. గిప్పుడు నా తాన బుడ్డ పైస గూడ లేదు. నన్ను గూడ మీ ఊరోడే అనుకోని నూరు రూపాలు బదలియ్యుండ్రి. మీరు నూరు రూపాల్ ఇస్తె గవ్విటితోని బొగ్గులు, పాలు, చాయ్ పత్తి గొనుక్కొచ్చుకుంట. గొనుకొచ్చుకోని చాయ్ జేస్త. గా చాయ్ అమ్మంగ ఒచ్చిన పైసలతోని నా బత్కు నెల్ల దీసుకునుడే గాకుంట వారం దినాలల్ల మీ బాకి గూడ చుక్తజేస్త" అని అన్నడు.


గా ఊరి పెద్దమనుసులల్ల శాన మంది గాయిన మాటలను బరోసజెయ్యలేదు. గని కొంత మంది బరోస జేసిండ్రు.

"కొత్తోడైతేంది. మనసుంటి మనిసే గదా. మనిసిని మనిసి బరోస జెయ్యకుంటె ఎట్ల" అనుకుంట ఒక పెద్దమనిసి పక్కూరికెల్లి బొగ్గుల పొయ్యితోని ఒచ్చినాయినకు నూరు రూపాలు బదలిచ్చిండు.

బదల్ దీసుకున్న నూరురూపాల తోని పల్లెటూరాయిన చాయ్ యాపారం షురూ జేసిండు. బొగ్గుల పొయ్యి బెట్టుకోని ఒక చౌరస్తల గూసున్నడు. ఒచ్చెపోయెటోల్లందరు గాయిన తాన చాయ్ దాగబట్టిండ్రు. గాయిన యాపారం మంచిగ నడ్వబట్టింది. నాలుగు దినాలల్లనే గాయిన నూరురూపాల బాకి చుక్త జేసిండు. నిజం జెప్పాల్నంటె గాయిన చాయ్ అమ్మంగ ఒచ్చిన పైసలతోని బాకి చుక్త జెయ్యలేదు. ఊరికెల్లి దెచ్చుకొన్న నూరు రూపాలతోనే బాకి చుక్త జేసిండు. వారం దినాలల్ల బాకి చుక్త జేస్తనోడు నాలుగు దినాలల్లనే బాకి చుక్త జేసినందుకు గా ఊరోల్లందరు గాయినను బరోస జెయ్యబట్టిండ్రు. మెల్లమెల్లగ గాయిన ఒక నాలుగు గిర్రల నూకుడు బండి గొన్నడు. గా బండి మీద ఊరంత దిరుక్కుంట చాయే గాకుంట మిర్చకాయ బజ్జిలు గూడ అమ్మబట్టిండు. గిట్ల కొన్ని దినాలైనంక ఒక పెద్ద మనిసి తానికి బోయి గాయిన వెయ్యిరూపాలు బదలడిగిండు. గిట్ల అడ్గంగనే గట్ల గా పెద్ద మనిసి గాయినకు వెయ్యి రూపాలు బదలిచ్చిండు. బదల్ దీస్కున్న రెండు మూడు దినాలకు గాయిన గా ఊర్లెకెల్లి పరారయ్యిండు.

గట్ల పరారైన గాయిన శాన దూరంల ఉన్న ఇంకొక ఊరికి బోయిండు. బోయెటప్పుడు యెంబడి బండిని గూడ గొంచబోయిండు. గప్పుడు గాయిన తాన వెయ్యిరూపాలు ఉన్నయి. గా ఊరి పెద్దమనుసుల తాన్కి బోయి -

"మాది పెద్ద కుటుంబం. నా పెండ్లాం పిల్లలనే గాకుంట మా తమ్ముండ్లను గూడ నేనే సాదాలె. గంతే గాకుంట మా చెల్లెకు పెండ్లి జెయ్యాలె. మీరు గిన వెయ్యి రూపాలు బదల్ ఇస్తిరా అంటె మీ ఊర్లె గుడిసె ఓటల్ బెట్టుకుంట. వారం దినాలల్లనే మీబాకి చుక్త జేస్త.



నా మీద గిన బరోస లేకుంటె గీబండి గిర్వి ఉంచుకోండ్రి " అని అన్నడు.

ఒక పెద్ద మనిసి గా బండిని గిర్విబెట్టుకోని వెయ్యిరూపాలు బదల్ ఇచ్చిండు.

వెయ్యిరూపాలతోని గాయిన గుడిసె ఓటల్ బెట్టిండు. గా ఓటల్ల చాయ్, కాపిలే గాకుంట ఇడ్లిలు, దోసెలు, బజ్జీలు అసుంటి పలారాలు జేసి అమ్మబట్టిండు. గుడిసె ఓటల్ బెట్టిన మూడు దినాలకే గాయిన వెయ్యిరూపాల బాకి చుక్త జేసిండు. ఇగ దాంతోని అందరు గాయినను బరోస జెయ్య బట్టిండ్రు. గాయిన ఓటల్ యాపారం బాగ నడ్వబట్టింది. గుడిసె ఓటల్ బంగ్ల ఓటల్ అయ్యింది. ఇంతకు ముంగట కుద్దు చాయ్ జేసె గాయిన గిప్పుడు చాయ్ జేస్తలేడు. చాయ్, ఇడ్లి, దోసె అసుంటి పలారాలు గాయిన కింద పనిజేసెటోల్లే జేస్తున్నరు. గాయిన ముద్దుగ గల్ల మీద గూసోని పైసల్ దీస్కుం టున్నడు. ఎటూ పొద్దుబోకుంటె రూపాలెం చుకుంట గూసుంటున్నడు. కొన్ని నెలలైనంక గాయిన ఒక సేటు తాన లచ్చ రూపాలు బదల్ దీస్కున్నడు. బరోసజెయ్యబట్కె నోటి మాట మీద గాయినకు గా సేటు బదల్ ఇచ్చిండు. బదల్ దీస్కున్న నెల దినాలకు గాయిన గా ఊరికెల్లి గూడ పరారైండు.

గీ పారి గాయిన పట్నం బోయిండు. పట్నం బోంగనే గాయిన ఇంతకు ముంగటి లెక్క ఎవ్వలి తాన బదల్ అడ్గలేదు. దగ్గరున్న రూపాలతోని ఒక పెద్దమనిసిని ముంచంగ ఒచ్చిన లచ్చరూపాలతోని మంచిఅడ్డల ఒక పెద్ద ఓటల్ బెట్టిండు. గా ఓటల్‌ను పురాగ ఏ.సి. జేపిచ్చిండు. పారినోల్లు గిన ఒస్తె ఈతగొట్టెతందుకు స్విమ్మింగ్‌పూల్ గూడగా ఓటల్ల గట్టిపిచ్చిండు. గంతే గాకుంట గదే ఓటల్ల ఒక బార్ గూడ బెట్టిపిచ్చిండు. తీరుతీర్ల పలారాలే గాకుంట బిర్యానిలు జేసెతందుకు వేలరూపాల జీతం మీద వంటజేసెటోల్లను దీస్కొచ్చిండు. పనిమీద శాన మంది పట్నం ఒస్తుంటరు. పట్నం ఒచ్చెటోల్లందరికి పట్నంల సుట్టాలుండరు. గనుంటోల్లు యాడ ఉంటరు. నిజాం జమానలైతె సత్రాలు ఉండేటియి. గిప్పుడు గాడొక సత్రం గీడొక సత్రం ఉంటున్నది. గా సత్రాలల్ల గూడ సౌలత్లు ఉంట లేవు. గీ ఓటల్ల కొన్ని అర్రలల్ల అన్ని సౌలత్లు ఉండెటట్లు జేస్తినా అంటె పట్నంకు ఒచ్చెటోల్లు మా ఓటల్ల ఉంటరు. నాకు ఆమ్దాని గూడ బగ్గొస్తది అని గాయిన అనుకున్నడు. అనుకోని ఓటల్ల కొన్ని అర్రలల్ల నుంచాలు ఏపిచ్చిండు. టి.విలు గూడ బెట్టిపిచ్చిండు.

కొన్ని నెలలకే గాయిన బెట్టిన ఓటల్‌కు పట్నంల మంచి పేరు ఒచ్చింది. పెద్దపెద్దోల్లందరు గా ఓటల్‌కే బోబట్టిండ్రు. లీడర్లు ఎవ్వలు ఒచ్చినా గా ఓటల్లనే ఉండబట్టిండ్రు. ఇంతకు ముందు గాయిన రూపాలు ఎంచుకునెతందుకన్న గల్ల మీద గూసుండెటోడు. గిప్పుడు గది గూడ గూసుంట లేడు. ఎందుకంటె గల్ల మీద గూసుండె తందుకు రూపాలు లెక్క బెట్టెతందుకు గూడ గాయినతాన జీతగాల్లు ఉన్నరు. పట్నంల గాయిన ఓటల్ మంచిగ నడ్వ బట్టింది. గాయిన ఓటల్ మొకాబిల ఏ ఓటల్ లేదని పేరు ఒచ్చింది. బగ్గ ఆమ్దాని వొచ్చెబట్కె గాయిన రాజకీయాల్ల దిగిండు. ఎమ్మెల్యె అయ్యిండు. గాయినకు మంత్రి గావాలని ఉండె. గని గుండె పోటు వొచ్చెబట్కె గాయిన సచ్చిండు. గాయిన పీన్గను కాలబెట్టెతందుకు బొందల గడ్డకు దీస్కబోబట్టిండ్రు. గింతకు గాయిన పీన్గ కాలిందా లేదా? గీ సవాల్‌కు జవాబ్ ఎర్కుండి గూడ జెప్పకుంటివా అంటె నీ మోటర్ బిరక్ పేలైతది" అని బేతాలుడు అన్నడు.

"గాయిన పీన్గను పాడె మీద బెట్టి మోస్కబోతున్నప్పుడు దింపుడు కల్లెం తాన పాడెను దించిండ్రు. గాయిన చెంచగాల్లు ఒక మంత్రి కుర్సిని దెచ్చి దింపుడుకల్లెం తాన బెట్టిండ్రు. మంత్రి కుర్సిని బెట్టంగనే సచ్చిన గాయిన లేసి మంత్రి కుర్సి మీద గూసున్నడు" అని విక్రమార్కుడు జెప్పంగనే బేతాలుడు మోటర్ రుకాయించుమన్నడు. విక్రమార్కుడు రుకాయించంగనే బేతాలుడు మోటర్ దిగి ఆటోల ఇంటికి బోయిండు.

– తెలిదేవర భానుమూర్తి